ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
ఆదివారం 23 జూన్ 2024



గొర్రెల పథకానికి స్వస్తి

- లబ్ధిదారుల వాటాధనం తిరిగి వాపస్
- రెండో విడతలో జిల్లాలో 1,470 మంది డీడీలు కట్టిన లబ్ధిదారులు
- మొదటి విడతలో 346 మంది ఖాతాల్లోకి వాటాధనం
- వారం రోజుల్లో మరో 471 మంది వాటాధనం చెల్లింపు
- గొల్ల కురమల్లో నిరాశ

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

గొల్ల కుర్మలను ఆర్థికంగా బలోపేతం చేసే లక్ష్యంగా గత ప్రభుత్వ హయాంలో 2017లో ప్రారంభించిన సబ్సిడీ గొర్రెల పథకానికి గుడ్‌బై చెప్పారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో మొదటి విడతలో అనేక అవకతవకలు వెలుగుచూడగా రెండో విడత గొర్రెల పంపిణీ అనేక అవాంతరాలతో ముందుకు సాగలేదు. రెండో విడతలో ఎంపికైన లబ్ధిదారులు గొర్రెల యూనిట్ల కోసం చెల్లించిన వాటాధనాన్ని తిరిగి ప్రభుత్వం చెల్లిస్తోంది. ప్రభుత్వ అదేశాల మేరకు జిల్లా యంత్రాంగం వాటాధనం తిరిగి ఇచ్చే ప్రక్రియ వేగవంతం చేసింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో రెండో విడతలో 1,470 మంది లబ్ధిదారులు యూనిట్ల కోసం వాటాధనం కింద ఒక్కో లబ్ధిదారుడు రూ. 43,750 చెల్లించారు. యూనిట్లు వచ్చే పరిస్థితి లేకపోవడంతో తిరిగి వాటాధనం ఇవ్వాలని లబ్ధిదారులు కోరారు. ఈ మేరకు అధికార యంత్రాంగం 1,470 మంది లబ్ధిదారుల్లో మొదటి విడతగా 717 మందికి వాటాధనం తిరిగి చెల్లిస్తున్నారు. ఇందులో 346 మంది లబ్ధిదారులకు వారి ఖాతాల్లో డబ్బులు జమ చేశారు. కలెక్టర్ల బదిలీ ప్రక్రియతో ఆగిన మిగతా లబ్ధిదారుల వాటాధనం ఈ వారంలో మరో 471 మందికి చెల్లించనున్నారు. గొర్రెల పథకం ద్వారా మొదటి విడత లబ్ధిదారులు లబ్ధి చేకూరగా, రెండో విడతలో లబ్ధిదారులుగా ఎంపికైనా యూనిట్లు రాకపోవడంతో గొల్ల కుర్మలు నిరాశ చెందుతున్నారు. జిల్లాలో మొదటి విడతలో 8,137 యూనిట్ల లక్ష్యానికి గానూ 7,517 యూనిట్లను పంపిణీ చేశారు. రెండో విడతలో 8,033 యూనిట్ల పంపిణీ లక్ష్యం కాగా ఇప్పటి వరకు 4,017 యూనిట్లను పంపిణీ చేశారు. ఎన్నికలకు ముందు 2023 మంది లబ్ధిదారులు తమ వాటాధనాన్ని చెల్లించారు. ఇందులో కేవలం 570 గ్రౌండింగ్ చేసి పంపిణీ చేశారు. ఎన్నికల కోడ్ రావడంతో నిలిచిపోయింది. కొత్త ప్రభుత్వం వాటాధనం తిరిగి ఇవ్వడంతో గొర్రెల పథకం ఇకలేనట్లేనని భావిస్తున్నారు.

● 2017లో గొర్రెల సబ్సిడీ పథకం ప్రారంభం

గొల్ల కుర్మల సంక్షేమం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2017 సంవత్సరంలో సబ్సిడీపై గొర్రెల యూనిట్లు పంపిణీ పథకం శ్రీకారం చుట్టింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 255 గ్రామ పంచాయతీల పరిధిలోని 190 గొర్రెల సహకార సంఘాల్లోని సభ్యుల్లో రెండు విడతలుగా డ్రా పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. జిల్లాలో రెండు విడతలకు సంబంధించి 16,170 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఇందులో ఇప్పటి వరకు 11,542 మంది లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లను అందించారు. గొర్రెల యూనిట్ల కోసం 2017-2018లో ప్రారంభించిన ఈ పథకం కోసం లబ్ధిదారులు నిరీక్షిస్తూనే ఉన్నారు. గొల్ల కుర్మల ఆందోళనలు వ్యక్తం అవుతున్న దశలో యూనిట్ల పంపిణీ ప్రారంభించడం మళ్లీ నిలిచిపోవడం పరిపాటిగా మారింది. గొల్ల కుర్మల ఆర్థికాభివృద్ధి కోసం పథకం ప్రారంభంలో యూనిట్ ధర 1.25 లక్షలుగా నిర్ణయించారు. ఆ తరువాత యూనిట్ ధరను రూ 1.75 లక్షలకు పెంచారు. జిల్లాలో 190 సొసైటీల్లో 18 సంవత్సరాలు నిండిన గొల్ల కుర్మలను సభ్యులుగా చేర్చు కొని డ్రా పద్ధతి ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేశారు. మొదట ఒక యూనిట్ ధర రూ 1.25 లక్షలు ఉండగా ఇందులో 75 శాతం సబ్సిడీ 25 శాతం లబ్ధిదారుని వాటా కింద చెల్లించారు. రూ. 50 వేల వరకు పెంచి 1.75 లక్షలు చేశారు. ఇందులో లబ్ధిదారుడి వాటా 25 శాతం కింద రూ. 43,750 చెల్లించాల్సి ఉండగా 2023 మంది లబ్ధిదారులు రూ 8.85 కోట్లు వాటా ధనం చెల్లించి గొర్రెలు రాకపోగా వడ్డీ చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. మొదటి విడత గొర్రెల పంపిణీ ఏదో విధంగా పూర్తి చేసినా రెండో విడతలో పూర్తిగా పథకమే లేకుండా పోయింది.

● గొర్రెల పంపిణీ లెక్కలపై నివేదిక...

కొత్త ప్రభుత్వం గొర్రెల పథకంలో జరిగిన అవకతవలకపై విచారణ ప్రారంభించింది. ఇందులో భాగంగా రాజన్నసిరిసిల్ల జిల్లాలో గొర్రెల పంపిణీ పథకానికి సంబంధించి ఎన్ని యూనిట్లను కొనుగోలు చేశారు. ఎన్ని యూనిట్లను పంపిణీ చేశారు. లబ్ధిదారులు ఎవరూ, బిల్లుల చెల్లింపునకు సంబంధించిన సమాచారాన్ని ప్రభుత్వానికి పంపించినట్లుగా తెలిసింది. జిల్లాలో గతంలోనే అనేక అవకతవకలు వెలుగు చూసిన సందర్భాలు ఉన్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొదటి విడత గొర్రెల పంపిణీలో కడప జిల్లానుంచి గొర్రెలను తీసుకరావడం మళ్లీ గొర్రెలను ఆంధ్రాకు పంపించడంతో అక్రమాలు చోటుచేసుకున్నాయి. ఆంధ్రా తెలంగాణల మధ్య గొర్రెలు చక్కర్లు కొట్టాయి. అనేక సందర్భాల్లో గొర్రెలను పట్టుకోవడంతో పాటు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారితో పాటు మండల అధికారి కూడా సస్పెండ్‌కు గురైన సంఘటనలు చోటు చేసుకున్నాయి.

వాటాధనం చెల్లిస్తున్నాం...

- కొమురయ్య, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గొర్రెల యూనిట్ల కోసం లబ్ధిదారులు చెల్లించినా వాటాధనం తిరిగి చెల్లిస్తున్నాం. వాటాధనం కోసం 717 మంది దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో ఇప్పటికే 346 మంది లబ్ధిదారులకు వాటాధనం తిరిగి చెల్లించాం. మరో 471 మందికి సంబంధించిన వాటాధనం ఈ వారంలో చెల్లిస్తాము.

ఎస్బీ సీఐ అనిల్‌కుమార్ ఐజీకి అటాచ్

సిరిసిల్ల క్రైం, జూన్ 22: సిరిసిల్ల జిల్లా స్పెషల్ బ్రాంచ్ సీఐ అనిల్‌కుమార్‌ను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఐజీ రంగనాథ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్‌ను రెగ్యులర్ సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

26న స్పోర్ట్స్‌స్కూల్ ప్రవేశాలకు ఎంపిక పోటీలు

ఇల్లంతకుంట, జూన్ 22: స్పోర్ట్స్‌స్కూల్స్‌లో ప్రవేశాలకు ఈనెల 26న ప్రవేశాలకు ఎంపిక పోటీలు ఉంటాయని ఎంఈఓ బన్నాజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పోటీలు ఉంటాయని తెలిపారు. 2023-24 విద్యాసంవత్సరంలో మూడో తరగతి పూర్తిచేసిన వారు స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశం ఉంటుందని పేర్కొన్నారు.

హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్‌లో..

తంగళ్లపల్లి, జూన్ 22: హైదరబాద్ హకీంపేట్‌లోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఈ నెల 24వ తేదీన ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఎంఈవో దూస రఘుపతి ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరం నాలుగో తరగతిలో అడ్మిషన్ కోసం ఎంపిక నిర్వహిస్తున్నట్లు, 8, 9 సంవత్సరాల వయస్సు గలవారు అర్హులని పేర్కొన్నారు. 24వ తేదీన మధ్యాహ్నం నిర్వహించే ఎంపికకు తంగళ్లపల్లి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని సూచించారు. తంగళ్లపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుల అధ్వర్యంలో ఎంపిక జరుగుతుందని విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మత్తడి పనులు సత్వరమే పూర్తిచేయాలి

ఇల్లంతకుంట, జూన్ 22: మండలంలోని కందికట్కూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రంగపేట చెరువు మత్తడి పనులను వెంటనే పూర్తి చేయాలని ఎంపీపీ వెంకటరమణారెడ్డి సూచించారు. మత్తడి పనులను శనివారం పరిశీలించారు. వర్షాకాలం వచ్చినందున రైతులకు సౌలభ్యంగా ఉండే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

వరదనీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి

- భూగర్భ జలాల పెంపునకు రూ. 12 లక్షల నిధులు
- సిరిసిల్ల మున్సిపల్ సమావేశం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్ల, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలో వర్షాకాలం దృష్ట్యా వరదనీటి సమస్యలు ఏర్పడకుండా తగు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కౌన్సిల్ నిర్ణయించింది. వరదనీటి సమస్యల నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టాలని చర్చించారు. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి అధ్యక్షతన సిరిసిల్ల మున్సిపల్ సాధారణ సమావేశం జరిగింది. సిరిసిల్లలోని అభివృద్ధి పనులకు సంబంధించి 16 అంశాలతో ప్రవేశపెట్టిన ఎజెండాను కౌన్సిల్ ఆమోదించింది. వర్షాకాలం దృష్ట్యా వరదనీటి సమస్యలు తలెత్తకుండా సిరిసిల్ల కొత్త చెరువు మత్తడి నుంచి శ్రీనగర్ కాలనీ వరకు కచ్చా కాలువలో ఉన్న మట్టిని తొలగించడానికి నిర్ణయించారు. నెహ్రూనగర్ నుంచి శాంతినగర్ వరకు, కొత్త బస్టాండ్, వెంకంపేట దోబీఘాట్ నుంచి కొత్త చెరువు వరకు ఉన్న మురికి కాలువల్లోని సిల్ట్‌ను తొలగించాలని నిర్ణయించారు. పట్టణంలోని మురికి కాలువల్లోని నాలాల్లో పేరుకుపోయిన సిల్ట్‌ను తొలగించాలని, వరదనీటి వల్ల ఎలాంటి ఇబ్బందులు ప్రజలకు కలగకుండా చూసే విధంగా కౌన్సిల్, అధికారులు సిబ్బంది సూచనలు చేశారు. మురికి కాలువలో సిల్ట్‌ను తొలగించడానికి రూ. 16 లక్షలు, కొత్త కల్వర్టులు, మరమ్మతులకు రూ. 14 లక్షలు, కౌన్సిల్ మంజూరు ఇచ్చింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు భూగర్భ జలమట్టాన్ని పెంచే విధంగా మున్సిపల్, స్థలాల్లో నీటి నిల్వ నిర్మాణాలు చేపట్టాడానికి రూ. 12 లక్షల నిధులు కేటాయించారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల్లో శానిటేషన్ నిర్వహణ, మోరం, అర్‌సీసీ పైపులు ఇతర అవసరాల కోసం రూ. 16 లక్షలు మంజూరు చేశారు. పవర్‌బోర్‌ల రిపేర్లు, మోటార్ల కొనుగోలు, ఇతర నీటి సరఫరా అవసరాలకు రూ 10 లక్షలు, భద్రతా దృష్ట్యా సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ. ఐదు లక్షలు, నీటి సరఫరా పైపులైన్లు, మురికి కాలువ నిర్మాణాలకు రూ. 5.90 లక్షలు మంజూరు చేశారు. సిరిసిల్లలో ప్రధాన కూడళ్ల వద్ద హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు రూ. 10 లక్షలు, మంజూరు చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ లావణ్య, వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు, పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎస్పీ: వృద్ధుడికి అంత్యక్రియలు

తంగళ్లపల్లి, జూన్ 22: వృద్ధుడి అంత్యక్రియలు నిర్వహించి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మానవత్వం చాటుకున్నారు. శుక్రవారం రాత్రి తంగళ్లపల్లి మండలం మండెపల్లి కేసీఆర్ నగర్‌లో వృద్ధుడు కాల్వ లక్ష్మణ్ గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి బంధువులు అందుబాటులో లేక పోవడంతో పాటు అంత్యక్రియలు నిర్వహించడానికి భార్య చేతిలో చిల్లి గవ్వలేని విషయాన్ని స్థానిక యువకుడు వాట్సాప్ మేసేజ్ ద్వారా ఎస్పీ అఖిల్ మహాజన్‌కు సమాచారం అందించాడు. తక్షణమే స్పందించిన ఎస్పీ తంగళ్లపల్లి ఎస్ఐ సుధాకర్‌ను అంత్యక్రియలు నిర్వహించే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్ఐ సుధాకార్ కేసీఆర్‌నగర్‌ను సందర్శించి మృతుడి భార్యను ఓదార్చి అంత్యక్రియలకు ఏర్పాటు చేశారు. శనివారం పోలీసులు అధ్వర్యంలో వృద్ధుడి అంత్యక్రియలు నిర్వహించి ప్రజల మన్ననలు పొందారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అమ్మాలి: డీఏవో



రికార్డులను పరిశీలిస్తున్న డీఏవో

గంభీరావుపేట, జూన్ 22: రైతులకు నాణ్యమైన విత్తనాలను, ఎరువులను అందించాలని, ఎరువులను ఈ పాస్ మిషిన్ ద్వారానే అమ్మాలని జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్ వెల్లడించారు. గంభీరావుపేట మండల కేంద్రంతో పాటు కొత్తపల్లి, గజసింగవరంలోని పీఏసీఎస్ దుకాణాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అమ్మకాలు, కొనుగోళ్ల రికార్డులను జిల్లా వ్యవసాయ అధికారి పరిశీలించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను అందించడంతో పాటు రషీద్‌లు ఇవ్వాలన్నారు. వరిలో కాంప్లెక్స్‌కి బదులు డీఏపీ ఎరువుల వాడకం మంచిదని, నాసిరకం విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం నర్మాల రైతు వేదికలో నూతనంగా రైతుల కోసం ఏర్పాటు చేసిన వీసీ యూనిట్‌ను సందర్శించారు. అదే విధంగా గంభీరావుపేట రైతు వేదికలో ఏఈవోలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం గంభీరావుపేటలోని కొట్టె అంజయ్య ఆయిల్‌పామ్ క్షేత్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్, మండల వ్యవసాయ అధికారి వెంకటేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు పరిశీలించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డిపేట, జూన్ 22: ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లోని 33/11 కేవీ విద్యుత్తు సబ్ స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్, పదిర, పోతిరెడ్డిపల్లి, అగ్రహారం గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని సెస్ ఏఈ పృథ్వీధర్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు చేయనున్నామని తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కరెంటు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ పేర్కొన్నారు.

జిల్లా పరిషత్ స్కూల్ నుంచి జాతీయ స్థాయికి..

- ఇన్‌స్పైర్ మనాక్ పోటీలకు పవర్ లూమ్ క్లాత్ ఫోల్డింగ్ మెషీన్ ఎంపిక - సిరిసిల్ల ప్రభుత్వ స్కూల్ విద్యార్థి హేమంత్ ప్రతిభకు గుర్తింపు





విద్యార్థినిని అభినందిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ అరుణ, క్లాత్ ఫోల్డింగ్ మిషన్‌తో హేమంత్

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 22: తల్లిదండ్రులు, పవర్‌లూమ్ కార్మికులు, వారి ఇబ్బందులు దూరం చేయాలనే ఆ విద్యార్థి ఆలోచనకు ఉపాధ్యాయుడి తోడ్పాటుతో ఓ రూపం వచ్చింది. పవర్ లూమ్ క్లాత్ ఫోల్డింగ్ మెషీన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి దేశ రాజధానిలో చేపట్టనున్న పోటీలకు ఎంపికవడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణరాఘవరెడ్డి, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి శనివారం హేమంత్‌తో పాటు గైడ్ టీచర్ పాకాల శంకర్‌గౌడ్‌ను అభినందించారు

● కష్టాలను దూరం చేయాలని..

సిరిసిల్ల పట్టణం గణేష్ నగర్‌కు చెందిన జక్కని జ్ఞానేశ్వర్, రూప దంపతుల కొడుకు హేమంత్ సిరిసిల్ల శివనగర్‌లోని కుసుమ రామయ్య బాలుర స్కూల్ పదో తరగతి చదువుతున్నాడు. నిత్యం తన ఇంట్లో పవర్ లూమ్‌లపై ఉత్పత్తి అయిన బట్టలను మడత పెట్టేందుకు తన తల్లిదండ్రులు, సమీపంలోని కార్మికులు ఇబ్బంది పడుతున్నది చూసాడు. గంటల తరబడి బట్టను మడత పెడుతూ కాళ్లు, నడుము నొప్పులతో బాధపడే వారిని చూసి కన్నీటి పర్యంతమయ్యాడు. వారి కష్టాలను ఎలాగైనా దూరం చేయాలని ఎన్నో రోజులు ఆలోచించాడు. దీనిపై తన స్కూల్‌లోని ఉపాధ్యాయులతో మాట్లాడాడు. వారి సలహాలు, సూచనల మేరకు దాదాపు రెండు నెలల పాటు కష్టపడి రెండు వేల రూపాయలతో పవర్ లూమ్ క్లాత్ ఫోల్డింగ్ మెషీన్‌ను చక్రాలు, చైన్స్, మోటార్, సెన్సార్‌ను ఉపయోగించి తయారు చేశాడు. బట్టలు మడత పెట్టేందుకు గంట సమయం పడుతుండగా, ఈ యంత్రం సాయంతో కేవలం 10 నిమిషాల వ్యవధిలో పూర్తి చేయవచ్చని హేమంత్ చెప్పాడు.

● కలెక్టరేట్‌లో ప్రదర్శన..

హేమంత్ తయారు చేసిన పవర్ లూమ్ క్లాత్ ఫోల్డింగ్ మిషన్ ఫిబ్రవరిలో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికకాగా, అప్పటి కలెక్టర్ అభినందించారు. అలాగే సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఆవరణలో హేమంత్ ఎగ్జిబిట్‌ను ప్రదర్శించారు. ఈ ఎగ్జిబిట్‌ని టీ వర్క్స్ హైదరాబాద్‌కి పంపించారు. హేమంత్ తయారు చేసిన ఎగ్జిబిట్ ను ఈ నెల 16, 17 తేదీల్లో హైదరాబాద్ లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ మానాక్‌కు ఎంపికైంది. వచ్చే నెలలో ఈ పోటీలు నిర్వహించనున్నారు.

● అభినందించిన జడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్

ప్రతిభ చూపిన విద్యార్థి జక్కని హేమంత్ ను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా శనివారం అభినందించారు. పవర్ లూమ్ క్లాత్ ఫోల్డింగ్ మిషన్ ఎగ్జిబిట్ ఇన్‌స్పైర్ మనాక్ జాతీయ స్థాయికి ఎంపికవడంతో జిల్లా విద్యాధికారి ఏ రమేష్‌కుమార్, జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు లకావత్ మోతిలాల్ విద్యార్థి హేమంత్‌తో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝాను కలువగా, వారిని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణరాఘవరెడ్డి, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి ఆ విద్యార్థిని అభినందించారు. జాతీయస్థాయికి ఎంపిక కావడం జిల్లాకు గర్వకారణమని కొనియాడారు.

రైతును రాజు చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



రైతులకు స్వీట్లు తినిపిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

'మహిళ శక్తి' పథకానికి 30లోగా అర్హులను గుర్తించాలి

ఎల్లారెడ్డిపేట, జూన్ 22: ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహిళ శక్తి' పథకానికి అర్హులను ఈ నెల 30 లోగా గుర్తించాలని రాష్ట్ర రిసోర్స్ పర్సన్ స్వప్న అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సెర్ప్- కావేరి మండల సమాఖ్య కార్యాలయంలో 'మహిళ ఉన్నతి- తెలంగాణ ప్రగతి'పై అన్ని గ్రామాల వీవోఏతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ మహిళల ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు ప్రభుత్వం రుణాలను అందజేస్తోందని అన్నారు. చిన్న తరహా పరిశ్రమలు, సామాజిక భద్రత కల్పించేందుకు కృషి చేస్తోందని అన్నారు. పాడి గేదెలు, కోళ్ల పెంపకం, పాలతో తయారు చేసే పదార్థాలు, మీ సేవ, మండల సమాఖ్య క్యాంటీన్, ఆహార శుద్ధి పరిశ్రమలను నెలకొల్పడానికి మహిళలకు అవగాహన కల్పించి ఆ దిశగా అడుగు వేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మండలంలో చేపట్టిన ధాన్యం కొనుగోలు కేంద్రాల సేకరణకు సంబంధించిన రికార్డులు, వివరాలను పరిశీలించారు. సమావేశంలో ఏపీఎం మల్లేశం, మండల సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు

- జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు



అల్మాస్‌పూర్‌లో పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి


ఎల్లారెడ్డిపేట/కోనరావుపేట/వీర్నపల్లి జూన్ 22: జిల్లాలోని అన్ని గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలు చేపట్టామని జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్, కోనరావుపేట మండలం కనగర్తి, వీర్నపల్లి మండలం కంచర్లలో చేపట్టిన డ్రై డే కార్యక్రమాన్ని శనివారం ఆయన పరిశీలించారు. గ్రామాల్లోని పలు వార్డుల్లో తిరుగుతూ పరిసరాలు, పారిశుధ్యంపై క్షేత్రస్థాయిలో ఆరా తీశారు. పలు ఇళ్ల ఆవరణలోని వస్తువులు, పరికరాల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు మాట్లాడుతూ జిల్లాల్లో వ్యాధుల కట్టడికి ప్రత్యేక శ్రద్ధ వహించామని అన్నారు. వారంలో రెండు రోజులు వైద్య సిబ్బంది, పారిశుధ్య సిబ్బందితో కలిసి చర్యలు చేపట్టేలా ప్రణాళికలు తయారు చేశామని పేర్కొన్నారు. ఆయన వెంట హెచ్ఈవో లింగం, మండలాల వైద్యాధికారులు ఉన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

ఎల్లారెడ్డిపేట, జూన్ 22: ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లి గ్రామ టీఆర్ఎస్ మాజీ ఉపసర్పంచ్ ప్రదీప్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు కరీంనగర్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో శనివారం బీజేపీలో చేరారు. వారికి బండి సంజయ్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. మండల కేంద్రంతో పాటు అల్మాస్‌పూర్‌లోని వేణుగోపాలస్వామి, సీతారామాంజనేయస్వామి ఆలయ పునఃనిర్మాణ కమిటీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, ఆయా గ్రామాల బీజేపీ నాయకులు మంత్రి సంజయ్‌కు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలయ పునః నిర్మాణం కోసం నిధుల మంజూరుకు కృషి చేయాలని విన్నవించినట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ప్రదీప్‌రెడ్డి, బుగ్గారెడ్డి, పర్శరాములు, నరేశ్, భాస్కర్, లక్ష్మారెడ్డి, ఈశ్వర్, కిషన్, ప్రభాకర్‌రెడ్డి, శరత్‌రెడ్డి ఉన్నారు.









వరుణుడు కరుణించాలని కప్పతల్లి ఆట



కన్నాపూర్‌లో కప్పతల్లి ఆడుతున్న గ్రామస్థులు

శంకరపట్నం, జూన్ 22: వరుణ దేవుడి కరుణ కోసం మండలంలోని మండలం కన్నాపూర్ గ్రామంలో రైతులు కప్పతల్లి ఆట ఆడారు. గత ఏడాది ఇప్పటికే విత్తనాలు వేశామని, నాట్లు కూడా కొంత మేర పూర్తి చేశామని మృగశిర కార్తి వెళ్లిపోతున్నా భారీ వర్షం లేదని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. దీంతో వర్షాలు సమృద్ధిగా పడాలని కప్పతల్లి ఆడుతు న్నామని గ్రామస్థులు తెలిపారు. రోకలి బండకు కప్పతల్లిని పసుపుగుడ్డలో కట్టి ఇంటింటికీ తిరిగారు. మహిళలు బిందెలతో నీరు పోస్తూ వరుణుడు కరుణించాలని వేడుకున్నారు. అనంతరం గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.







ప్రైవేట్ ఆసుపత్రిలో అగ్నిప్రమాదం

కరీంనగర్ క్రైం, జూన్ 22: కరీంనగర్ మంచిర్యాల చౌరస్తా సమీపంలోని గాయత్రి ఆసుపత్రిలో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. ఆసుపత్రి భవనం రెండో అంతస్థులో ఏసీ కంప్రెషర్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకున్నాయని కరీంనగర్ ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు. అగ్నిప్రమాదం జరిగిన సమయంలో ఆసుపత్రి 2వ అంతస్థులో పేషెంట్లు ఎవరూ లేక పోవటంతో ప్రమాదం తప్పిపోయింది. ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు వ్యాపించకుండా నియంత్రించారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, జూన్ 22: డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ముగ్గురు వాహనదారులకు కరీంనగర్ మున్సిఫ్ కోర్టు జడ్జి మూడు రోజుల జైలు శిక్ష విధించారని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లా ఖాన్ తెలిపారు. ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన 20మంది వాహనదారుల ను శనివారం కోర్టులో హాజరుపరచగా ఇందులో ముగ్గురికి జైలుశిక్షతో పాటు 6 వేల రూపాయలు జరిమానా విధించారన్నారు. మిగతా 17 మందికి 29,500 రూపాయలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.


ముగ్గురు కానిస్టేబుళ్లపై బదిలీ వేటు

హుజూరాబాద్, జూన్ 22: హుజూరాబాద్ డివిజన్‌లో ఎస్‌హెచ్‌వోకు దగ్గరగా మెదిలిన ముగ్గురు కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ సీపీ అభిషేక్ మొహంతి ఉత్తర్వులు జారీ చేసినట్లు శనివారం తెలిసింది. హుజూ రాబాద్, జమ్మికుంట పోలీస్ స్టేషన్లో పనిచేసే కానిస్టేబుళ్లు అవినాష్, పాషా, జమ్మికుంట రూరల్ స్టేషన్లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసే భాస్కర్‌రెడ్డిలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. గత నెల రోజులుగా హుజూరాబాద్ డివిజన్‌లోని పోలీస్ స్టేషన్లలో పనిచేసే ఆఫీసర్లకు అనుకూలంగా పని చేస్తున్నారని కానిస్టేబుళ్లపై సీపీ ఎస్‌బీ, ఇంటలీజెన్సీ విభాగాల ద్వారా సమాచారం సేకరించి బదిలీ వేటు వేసినట్లు తెలిసింది.

రెండో వివాహం చేసుకున్న ఒకరిపై కేసు

జమ్మికుంట రూరల్, జూన్ 22: జమ్మికుంట మండలం గోవిందాపూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి కొండు రవీందర్ రెండో వివాహం చేసుకున్నాడని మొదటి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోవిందా పూర్‌కు చెందిన రవీందర్‌కు మంచిర్యాల జిల్లా నస్పూర్‌మండలం తాళ్లపల్లి గ్రామానికి చెందిన లతతో 2009లో పెద్దల సమక్షంలో వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. రవీందర్ ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మాసిస్టుగా పని చేస్తున్నాడు. వివాహం జరిగినప్పటి నుంచి గోవిందాపూర్‌లోనే ఉంటున్నారు. గడిచిన ఏడాది కాలం నుంచి దంపతుల మధ్య కలహాలు చోటు చేసుకున్నాయి. ఈ ఏడాది జనవరి 20న కరీంనగర్ వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లాడు. ఫిబ్రవరి 18న గంగాధర మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన సంగీత అనే మహిళను ఎల్ఎండీ కాలనీలోని నర్సింహాస్వామి ఆలయంలో రెండో వివాహం చేసుకున్నాడు. విడాకులు ఇవ్వకుండా రెండో వివాహం చేసుకొని తనను, పిల్లలను రోడ్డు మీద పడేసిన భర్తపై మొదటి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపారు.





పేకాట స్థావరాలపై పోలీసుల దాడులు

సిరిసిల్ల క్రైం, జూన్ 22 సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లో ఓ వ్యక్తి ఇంట్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు ఆ ఇంటిపై దాడి చేసి ఎనిమిది మంది వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఇన్‌చార్జి సీఐ సదన్ కూమార్ శనివారం తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 19 వేల నగదు, ఏడు మొబైల్ ఫోన్స్ ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు. నిత్యం పోలీసుల ఆధ్వర్యంలో పేకాట స్థావరాలపై నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తామని ఎవరైనా గ్యాంబ్లింగ్, బెట్టింగ్, పేకాట వంటి జూదాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏమైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు, డయల్ 100కి సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

మేడిపల్లి/భీమారం : మండల కేంద్రం శివారులో పేకాటరాయుళ్లను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు జగిత్యాల సీసీఎస్ సీఐ లక్ష్మీనారాయణ, మేడిపల్లి పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఈ దాడుల్లో ఏడుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.4.50 లక్షల నగదు, ఒక బైక్, ఒక కారు, 7 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు.

ఎలిగేడు: జూలపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని లాలపల్లి గ్రామశివారులో పేకాట ఆడుతున్న శిబిరంపై పెద్దపల్లి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఏడుగురు తప్పించుకున్నారు. పట్టుబడిన వారి నుంచి రూ.16.080 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, నాలుగు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. విచారణ నిమిత్తం పట్టుబడ్డ నగదు, సెల్‌ఫోన్లు, బైక్‌లను జూలపల్లి పోలీసులకు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రవిప్రసాద్, హెచ్‌సీలు శ్రీనివాస్, మహేందర్, కానిస్టేబుళ్లు శేఖర్, అఖిల్, మల్లేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

హరీష్‌రావు, కేటీఆర్.. రాజీనామా పత్రాలు సిద్ధం చేసుకోవాలి

● ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల టౌన్, జూన్ 22: రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండి సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఏకకాలంలో రైతులకు ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణ మాఫీ చేయబోతున్నామని ఇక హరీష్‌రావు, కేటీఆర్‌లు రాజీనామా పత్రాలు సిద్ధం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ వ్యాఖ్యానించారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో శనివారం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డితో కలిసి విప్ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆగస్టు 15లోపు ఏకకాలంలో రుణమాఫీ చేయాలని సీఎం నేతృత్వంలో మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడంపై జిల్లా రైతుల పక్షాన సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రైతుల సమస్యలను పరిష్కరించి అండగా నిలిచి రైతు పక్షపాతిగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలిచిందన్నారు. ఏకకాలంలో రైతులకు రుణ మాఫీ చేయబోతున్న సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతగా జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించాలని కోరారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తిగా మరిచిందని మరోసారి గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చినదని చేప్పేందుకు ఆరు గ్యారంటీ పథకాల అమలే నిదర్శనమన్నారు. హరీష్‌రావు మాటకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 65 సీట్లతో సుస్థిరంగా ఉందని ఇతర పార్టీల నేతలను చేర్చుకోవాల్సిన అవసరం లేదన్నారు. రానున్న రెండు దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీ అధికారంలో


సమావేశంలో మాట్లాడుతున్న విప్, పాల్గొన్న ఎమ్మెల్సీ

ఉంటుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా కనుమరుగు కాబోతోందన్నారు. కొంత మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారంటే వారి అవకాశ వాదానికి అది నిదర్శనమని చెప్పవచ్చన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులకు పూర్తి స్థాయిలో పరిహారం అందించడంతో పాటు పంటల పథకంలో రైతుకు సంబంధించిన ప్రీమియం కూడా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. రైతులు సాగుచేసే సన్నరకాలకు మద్దతు ధరకు అదనంగా క్వింటాలు వరి ధాన్యానికి రూ.500 చెల్లిస్తామన్నారు. రైతు భరోసా విధి, విధానాల అమలుపై మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేసి అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టబోతుందన్నారు. సమావేశంలో పీసీసీ కార్యదర్శి బండ శంకర్, పీసీసీ సభ్యుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య, జగిత్యాల క్లబ్ సెక్రటరీ పుప్పాల అశోక్ తదితరులు ఉన్నారు.

రహదారి పనులను అడ్డుకున్న అటవీశాఖ అధికారులు

కరీంనగర్ రూరల్, జూన్ 22: కరీంనగర్ మండలంలోని ఇరుకుల్ల వాగు శివారులో గతంలో ప్రభుత్వం అటవీశాఖకు 17.34 గుంటల భూమిని కేటాయించింది. గత కొన్ని నెలల నుంచి ఇరుకుల్ల పరిధిలో జగిత్యాల-వరంగల్ జాతీయ రహదారి పనులను చేపట్టారు. ఇరుకుల్ల వాగు శివారులో సమ్మక్క గద్దెల సమీపంలో నుంచి రహదారి నిర్మాణ పనులు నడుస్తుండగా అటవీ భూముల్లో దారి నిర్మిస్తున్నారంటూ అటవీశాఖ అధికారులు పనులను అడ్డుకున్నారు. భూసేకరణ చేపట్టకుండానే తమ భూముల నుంచి రహదారి నిర్మిస్తున్నారని జిల్లా కలెక్టర్ పమేలాసత్పతికి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం రెవెన్యూ, ఫారెస్టు, నేషనల్ హైవే అధికారుల సమక్షంలో అటవీభూములను గుర్తించేందుకు సర్వే చేపట్టారు. సర్వే అండ్ ల్యాండ్ డిప్యూటీ ఇన్సిపెక్టర్ సేవియా నాయక్ ఆధ్వర్యంలో అటవీ భూములను పరిశీలించి ప్రాథమిక సర్వే నిర్వహించారు. మరోసారి పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి హద్దులను ఏర్పాటు చేస్తామని డీఐ సేవియా నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్‌కుమార్, ఆర్ఐ వాస్తవిక్, సర్వేయర్లు సంతోష్, రాకేష్, ఫారెస్టు రేంజ్ ఆఫీసరు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం

జగిత్యాల టౌన్, జూన్ 22: ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు తీసుకుని మోసం చేసిన కేసులో ఇద్దరిపై జగిత్యాల పట్టణ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. సారంగాపూర్ మండలం లక్ష్మీదేవిపల్లి, ధర్మపురి మండలం దొంతాపూర్ గ్రామానికి చెందిన ఇద్దరి వ్యక్తులకు ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ జగిత్యాలకు చెందిన ముఫీజ్ ఉల్ హక్, వరంగల్‌కు చెందిన ఇంతియాన్ అనే ఇద్దరు వ్యక్తులు రూ. 19 లక్షలు వసూలు చేశారు. రోజులు గడిచినా ఉద్యోగం రాకపోవడంతో తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని లక్ష్మీదేవి పల్లి గ్రామానికి చెందిన బాధితుడి తండ్రి శంకరయ్య శనివారం జగిత్యాలలో ఉన్న ముఫీజ్ ఇంటికి వెళ్లి నిలదీశాడు. తీసుకున్న డబ్బులు ఇవ్వకపోవడంతో పాటు శంకరయ్యను కులం పేరుతో ముఫీజ్‌తో పాటు అతని భార్య దూషించారు. దీంతో శంకరయ్య పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మానకొండూర్‌లో అదృశ్యం.. కుమరం భీం జిల్లాలో హత్య

● కేసును ఛేదించిన పోలీసులు

మానకొండూర్, జూన్ 22: మానకొండూరులో అదృశ్యమైన యువకుడు కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండల కేంద్రంలో దారుణంగా హత్యకు గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మానకొండూరు సీఐ రాజ్‌కుమార్ శనివారం వివరాలు వెల్లడించారు. మానకొండూరు గ్రామానికి చెందిన అనంతోజు సాయికిరణ్(29) ఏప్రిల్ 18, 2024న భార్య అనూషతో సిద్దిపేటకు వెళ్లివస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆమె మే 2న మానకొండూరు పోలీసు స్టేషన్‌లో తన భర్త కనిపించడం లేదని ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ మొదలుపెట్టారు. నాలుగు సంవత్సరాల క్రితం సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం కొండాపూర్ గ్రామంలోని ఓ పౌల్ట్రీ ఫాంలో అనంతోజు సాయికిరణ్ పనిచేస్తుండగా, దహెగాంకు చెందిన బట్టి సునీత, ఆమె భర్త శ్రీనివాస్ పరిచయమయ్యారు. సునీత, సాయికిరణ్‌తో సాన్నిహిత్యంగా ఉండడంతో ఇరు కుటుంబాల్లో గొడవలు జరిగాయి. దీంతో సాయికిరణ్ భార్య అనూషతో కలిసి మానకొండూరుకు వచ్చి కర్ర మిషన్‌లో పనిచేస్తున్నాడు. సాయికిరణ్ ఏప్రిల్18, 2024న మళ్లీ కోళ్ల ఫాంకు వెళ్లగా సునీత, శ్రీనివాస్ దంపతులతో గొడవ జరిగింది. దీంతో సునీత, శ్రీనివాస్ అదే రోజు దహెగాంకు వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న సాయికిరణ్ ఏప్రిల్ 19, 2024న దహెగాంలోని సునీత, శ్రీనివాస్ ఇంటికి వెళ్లాడు. అదేరోజు రాత్రి సునీత కుటుంబ సభ్యులు తండ్రి తుమ్మిడి గంగారాం, మేనమామ భీంకరి శ్యాంరావుతో పాటు సునీత, శ్రీనివాస్ కర్రతో సాయి కిరణ్‌పై దాడిచేసి హత్య చేశారు. ఎవరికీ అనుమానం రాకుండా మృతదేహాన్ని దహెగాంలోని హనుమాన్ ఆలయ సమీపంలోని పాడుబడ్డ బావిలో పడవేశారు. మానకొండూరు సీఐ రాజ్‌కుమార్ విచారణలో భాగంగా సునీత, శ్రీనివాస్‌ను విచారించగా హత్య విష యాన్ని అంగీకరించారు. శనివారం సాయికిరణ్ మృతదేహాన్ని బావిలో నుంచి తీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.


సాయికిరణ్ (ఫైల్)

విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతి

● సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ఆందోళన

మల్లాపూర్, జూన్, 22: మల్లాపూర్ మండల కేంద్రంలోని శివారులో శనివారం విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతి చెందాయి. సబ్‌స్టేషన్ ఎదుట మృతి చెందిన పాడి గేదెలను ఉంచి రైతులు ఆందోళన చేపట్టారు. ట్రాన్స్‌కో లైన్‌మన్ రవితేజపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఏడీఏకు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లాపూర్ శివారులోని గాంధీనగర్‌వాడ సమీపంలోని బర్ల మంద వద్ద ఉన్న విద్యుత్ స్తంభం తీగలు తెగిపడ్డాయని లైన్‌మన్‌కు నెల రోజులుగా కోరుతున్నామన్నారు. మరోవైపు తెగిపడిన విద్యుత్ తీగలకు కరెంటు సరఫరా అవుతుండటంతో ప్రమాదవశాత్తు రెండు పాడి గేదెలు మృతి చెందాయని తెలిపారు. తెగిన విద్యుత్ తీగలను సరిచేయకపోవడంతోనే రెండు పాడి గేదెలు మృతి చెందాయని ఫోన్ ద్వారా లైన్‌మన్ రవితేజకు తెలుపగా తమపై ఆగ్రహం వ్యక్తం చేశారని అన్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని రైతులు ఆరోపించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన లైన్‌మన్‌పై చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఏడీఏకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఒక్కో గేదె విలువ రూ. 50వేలు ఉంటుందని బాధితులు తెలిపారు. బాధిత రైతులకు నష్టపరిహారం అందజేసి న్యాయం చేయాలని కోరారు. గ్రామంలో విద్యుత్ స్తంభం నేలకొరుగడంతో మందుల భూమయ్య చెందిన సీమ పంది విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. రూ. 22వేలు నష్టం జరిగిందని తనకు న్యాయం చేయాలని విద్యుత్ అధికారులకు బాధితుడు వినతిపత్రం అందజేశారు.


సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టిన రైతులు

దొంగ కోసం పోలీసుల గాలింపు

మల్యాల, జూన్ 22: వరుస దొంగతనాల కేసుల్లో నిందితుడైన ఓ దొంగను పట్టుకోవడానికి పోలీసులు శనివారం ఉదయం గాలింపు చేపట్టారు. మండలంలో ఇటీవల ఇళ్లల్లో దొంగతనాలు జరుగడంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు అనుమానితులపై నిఘా పెట్టారు. ఇందులో భాగంగా సెల్‌ఫోన్ నంబర్ల ఆధారంగా దర్యాప్తు జరుపుతున్న పోలీసులకు శనివారం జగిత్యాల ప్రాంతంలో ద్విచక్రవాహనంపై వెలుతున్న ఓ దొంగను పట్టుకునేందుకు ప్రయత్నిస్తూ మల్యాల క్రాస్ రోడ్డు ప్రాంతం వరకు అతన్ని వెంబడించారు. మల్యాల, కొడిమ్యాల పోలీసులు ద్విచక్రవాహనంపై దొంగను అనుసరించడంతో అతను గుర్తించి తన వాహనం వేగాన్ని మరింతగా పెంచి పారిపోయినట్లు స్థానికుల ద్వారా తెలిసింది. మల్యాల క్రాస్ రోడ్డు ప్రాంతంలో దొంగ కోసం వెతికినా ప్రయోజనం లేకపోగా తృటిలో దొంగ తప్పిపోవడం, వెంటనే సెల్‌ఫోన్ ఆఫ్ చేయడంతో అతను వెళ్లిన మార్గం తెలియనట్లు సమాచారం. దొంగ తప్పించుకోవడంతో పోలీసులు గాలింపు మరింత పెంచినట్లు తెలిసింది.

ఒకరి ఆత్మహత్య

వేములవాడరూరల్, జూన్ 22: వేములవాడ రూరల్ మండలం హన్మాజీపేట గ్రామానికి చెందిన ఎల్లాల తిరుపతిరెడ్డి (48) అనే వ్యక్తి మతిస్థిమితం కోల్పోయి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వేములవాడ రూరల్ ఎస్ఐ మారుతి తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతిరెడ్డి తండ్రి రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. తండ్రి మృతితో మతిస్థిమితం కోల్పోయిన తిరుపతిరెడ్డి రెండు నెలల నుంచి తీవ్ర మనోవేదనకు గురవుతున్నాడు. ఈ క్రమంలో శనివారం తన పొలం వద్దకు వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వేములవాడ రూరల్ ఎస్ఐ మారుతి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య లక్ష్మీ, కూతురు ఉన్నారు.


తిరుపతిరెడ్డి (ఫైల్)

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

ధర్మపురి, జూన్ 22: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. జేష్ఠ శుద్ధ పూర్ణమితో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం వరకు క్షేత్రానికి భారీగా భక్తులు తరలివచ్చారు. గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకున్నారు. స్వామి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి ఆలయాల్లోకి ప్రవేశించారు. భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చన లు, నిత్య కళ్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. రాత్రి వరకు భక్తులు స్వామివారలను దర్శించుకున్నారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. సూపరింటెండెంట్ ద్యా వళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచారి పాల్గొన్నారు.


ధర్మపురిలో స్వామివారిని దర్శనం చేసుకుంటున్న భక్తులు

కొండగట్టులో భక్తుల సందడి

మల్యాల : కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో భక్తులు అభిషేకాలు, వ్రతాలు నిర్వహించారు. శుక్రవారం అర్ధరాత్రి కురిసిన వర్షంకు భక్తులు ఇబ్బందులు పడ్డారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో ఏసీబీ దాడులు

● స్టేషన్ బెయిల్ కోసం లంచం అడిగిన ఎస్సై ● మధ్యవర్తి అరెస్టు .. ఎస్సై పరారీ

రాయికల్, జూన్ 22: జగిత్యాల జిల్లా రాయికల్ పోలీస్‌స్టేషన్‌లో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. స్టేషన్ బెయిల్ కోసం రాయికల్ ఎస్సై అజయ్ లంచం డిమాండ్ చేయడంతో పక్కా సమాచారంతో అధికారులు శుక్రవారం రాత్రి దాడి చేశారు. ఏసీబీ అధికారుల రాకను పసిగట్టిన ఎస్సై తన ఇంటి ఆవరణలోని గోడ దూకి పరారయ్యాడు. డబ్బులు తీసుకున్న మధ్యవర్తిని అధికారులు అరెస్ట్ చేశారు. కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ రమణ మూర్తి కథనం మేరకు.. రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన గడ్డం రాజేందర్‌రెడ్డికి చెందిన ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తుండగా ఈ నెల 11న ఎస్సై తన సిబ్బందితో పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై అదే రోజు కేసు నమోదు చేశారు. ఈ విషయమై స్టేషన్ బెయిల్ కోసం రాజేందర్‌రెడ్డి ఎస్సైని కలువగా రూ. 50 వేలు ఇస్తేనే బెయిల్ ఇస్తానని డిమాండ్ చేశాడు. చివరకు రూ.25 వేలకు ఒప్పందం కుదిరింది. అదే రోజు రూ. 15 వేలు అందజేసి మిగతా డబ్బులను తర్వాత ఇచ్చేందుకు అంగీకరించారు. అనంతరం బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు శుక్రవారం మిగతా డబ్బులు ఎస్సైకి ఇచ్చేందుకు పథకం రూపొందించారు. ఏసీబీ అధికారులతో కలిసి బాధితుడు రూ.10 వేలు ఇచ్చేందుకు ఎస్సైని సంప్రదించగా మధ్యవర్తి పుల్లూరి రాజును కలిసి డబ్బులు ఇవ్వాలని వారికి సూచించాడు. దీంతో రాజేందర్‌రెడ్డి మధ్యవర్తి రాజుకు డబ్బులు ఇచ్చి ఇద్దరూ కలిసి రాత్రి 10 గంటల సమయంలో ఎస్సైకి డబ్బులు ఇచ్చేందుకు స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ ఎస్సై లేకపోవడంతో డబ్బులు తెచ్చామని ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. స్టేషన్‌కు చేరుకున్న ఎస్సైకి ఏసీబీ అధికారుల వాహనాలు కనబడడంతో స్టేషన్‌లోని క్వార్టర్స్ గోడ దూకి పరారయ్యాడు. డబ్బులు తీసుకున్న మధ్యవర్తి రాజును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదు చేసి కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరుపరిచినట్లు డీఎస్పీ తెలిపారు. పరారీలో ఉన్న ఎస్సై కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.


రాయికల్ పోలీస్‌స్టేషన్


రాజు అరెస్టును చూపుతున్న ఏసీబీ అధికారులు

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 16 మంది డీబార్

గణేశ్‌నగర్, జూన్ 22: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ రెండవ, నాలుగో సెమిస్టర్ పరీక్షల్లో శనివారం 16 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్ తెలిపారు. వైష్ణవి డిగ్రీ కళాశాల వేములవాడలో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిరిసిల్లలో ఒకరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగ్గురు, వివిఎస్ఆర్ డిగ్రీ కళాశాల హుజూరాబాద్‌లో ఇద్దరు, చాణక్య డిగ్రీ కళాశాల జమ్మికుంటలో ముగ్గురు, ట్రినిటీ డిగ్రీ కళాశాల పెద్దపల్లిలో ఇద్దరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పెద్దపల్లిలో ఒకరు, మహర్షి డిగ్రీ కళాశాల గోదావరిఖనిలో ఒకరు, శివాని డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఒకరు, శ్రీచైతన్య డిగ్రీ కళాశాల ధర్మపురిలో ఒకరు డీబార్ అయ్యారన్నారు.

చోరీ చేస్తూ పట్టుబడిన మహిళ

కరీంనగర్ క్రైం, జూన్ 22: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణీకుల డబ్బులు దొంగిలిస్తున్న ఒక మహిళను శనివారం ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది పట్టుకున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన జ్యోతి అనే మహిళ 16వ ప్లాట్‌ఫాం వద్ద హుజూరాబాద్‌కు చెందిన అనూష పర్సులో నుంచి నగదు, ఏటీఎం కార్డును, మంచిర్యాలకు చెందిన సరళ బ్యాగ్ నుంచి 3 వేల రూపాయలు దొంగిలిస్తుండగా పట్టుకుని ఒకటో టౌన్ పోలీసులకు అప్పగించారు.

మూలవాగులో మృతదేహం లభ్యం

వేములవాడ టౌన్, జూన్ 22: వేములవాడ మూలవాగులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పట్టణంలోని మల్లారం రోడ్డులో గల మూలవాగు ఇసుక రీచ్ సమీపంలో ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం వచ్చింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సుగల వ్యక్తిగా గుర్తిం చారు. మృతుడు బ్లాక్ ప్యాంట్, తెల్లటి షర్ట్ ధరించి ఉన్నాడని, మృతుడికి సంబంధించిన వివరాలు తెలియరాలేదన్నారు. అనుమానాస్పదంగా ఉన్నవారు వేములవాడ పోలీస్‌లను సంప్రదించాలని కోరారు.

ఒకరిపై చీటింగ్ కేసు నమోదు

జగిత్యాల టౌన్,జూన్ 22: తప్పుడు పత్రాలు సృష్టించి ఆస్తిని గిఫ్ట్‌డీడ్ చేసుకున్న ఒకరిపై జగిత్యాల పట్టణ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. బుగ్గారం మండలం శెకల్ల గ్రామానికి చెందిన రాకూర్ గణేష్ సింగ్‌తో పాటు అతని ముగ్గురి సోదరులకు జగిత్యాల పట్టణంలోని పోచమ్మవాడలో వారసత్వంగా వచ్చిన ఆస్తి ఉంది. గణేష్ సింగ్ సోదరుడు కిసాన్ సింగ్ తప్పుడు పత్రాలు సృష్టించి ఉమ్మడి ఆస్తిని తన భార్య పేరుమీదికి మార్చి ముగ్గురు సోదరులను మోసం చేశాడు. గణేష్‌సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కిసాన్ సింగ్‌పై కేసు నమోదు చేశారు.

రేషన్‌బియ్యం పట్టివేత

మల్యాల, జూన్ 22: మండలంలోని తక్కళ్లపల్లి శివారులో రేషన్ బియ్యంను పట్టుకున్నట్లు ఎస్సై అబ్దుల్‌రహీం తెలిపారు. గొల్లపల్లి మండలం గుంజపడుగు చెందిన గందం చందు అనే వ్యక్తి టాటా ఏస్ గూడ్స్ వాహనంలో బియ్యం తరలిస్తుండగా పట్టుకొని 13క్వింటాళ్ల బియ్యం, వాహనం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. చందుపై సుమోటో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నకిలీ గల్ఫ్ ఏజెంట్ అరెస్ట్

గంభీరావుపేట, జూన్ 22 : నకిలీ గల్ఫ్ ఏజెంట్‌ను అరెస్ట్ చేసినట్లు గంభీరావుపేట ఎస్ఐ రాంమోహన్ తెలిపారు. జగిత్యాల జిల్లా సారంగపూర్‌కు చెందిన దండుగుల సురేష్ అనే వ్యక్తి మండల పరిధిలోని కోళ్లమద్ది గ్రామానికి చెందిన చీకోటి స్వామిని గల్ఫ్ దేశానికి పంపిస్తామని మాయ మాటలు చెప్పి మోసం చేశాడని తెలిపారు. ఒరిజనల్ పాస్‌పోర్టు, 10 వేల నగదును సురేష్ తమ వద్ద తీసుకున్నాడని బాధితుడు స్వామి ఫిర్యాదు చేశాడని ఎస్ఐ వెల్లడించారు. సురేష్‌ను శనివారం అరెస్ట్ చేశామని ఎస్ఐ పేర్కొన్నారు. స్వామి వద్ద 8 ఒరిజినల్ పాస్‌పోర్టులు, 2 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసిన వికాస్‌రావు


కిషన్‌రెడ్డితో చెన్నమనేని వికాస్‌రావుదీప

వేములవాడ టౌన్, జూన్ 22: కేంద్ర బొగ్గు గనులశాఖ మంత్రి కిషన్‌రెడ్డిని వేములవాడ బీజేపీ నేత చెన్నమనేని వికాస్‌రావుదీప దంపతులు కలిసారు. హైదరాబాద్‌లోని కిషన్‌రెడ్డి నివాసంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వేములవాడలో బీజేపీ పార్టీ బలోపేతానికి కిషన్‌రెడ్డి పలు సూచనలు, సలహాలు చేసినట్లు తెలిపారు.

కేంద్రమంత్రి బండి సంజయ్‌ను కలిసిన ఎంపీటీసీ


బండి సంజయ్‌ను కలిసిన సంకెపల్లి ఎంపీటీసీ బుర్ర లహరిక

వేములవాడ టౌన్, జూన్ 22 : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సజయ్‌ను సంకెపల్లి ఎంపీటీసీ బుర్ర లహరికశేఖర్ కలిసారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పదవిబాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కరీంనగర్‌లో బండి సంజయ్‌ను మండలంలోని సంకెపల్లి గ్రామ ఎంపీటీసీ బుర్ర లహరిక శేఖర్‌లు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపినట్లు పేర్కొన్నారు.

● అభినందించిన మాజీ సర్పంచ్‌లు..

ఇల్లంతకుంట: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను శనివారం మాజీ సర్పంచులు కలిసి అభినందనలు తెలిపారు. కరీంనగర్‌లోని కార్యాలయంలో వెల్జిపూర్ మాజీ సర్పచు ఉడుతల వెంకటేశం, రహీంఖాన్‌పేట మాజీ సర్పంచు కముటం రాములు, బీజేపీ సీనియర్ నాయకులు దెశెట్టి శ్రీనివాస్, నాయి బ్రాహ్మణ సంఘ మండల అధ్యక్షుడు పందిల్ల అశోక్, నాయకులు బత్తిని సాయగౌడ్, కొండాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

నకిలీ గల్ఫ్ ఏజెంట్లు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, జూన్ 22: నకిలీ గల్ఫ్ ఏజెంట్లు తీరు మార్చుకోకపోతే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రటనలో హెచ్చరించారు. గల్ఫ్ ఏజెంట్ల చేతిలో మోసపోయిన వారు నేరుగా పోలిస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే తక్షణమే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా నుంచి ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లే యువకులు నకిలీ ఏజెంట్లకు డబ్బులు ఇచ్చి మోసపోవద్దని, ఇమ్మిగ్రేషన్ చట్టబద్ధత ఉన్నవారి నుంచి వీసాలు పొందాలన్నారు. జిల్లా నుంచి ఉపాధి కోసం గల్ఫ్ వెళ్లే వారి వద్ద నుంచి డబ్బులు తీసుకొని నకిలీ వీసాలు ఇచ్చి పాస్‌పోర్టు ఇవ్వకుండా మోసాలకు పాల్పడుతున్న నకిలీ ఏజెంట్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సంవత్సరం 34 కేసులలో 58 మందిని అరెస్ట్ చేసి ఇద్దరిని జైలుకు పంపామని ఆయన తెలిపారు. గల్ఫ్ దేశాలకు వెళ్లే వారు లైసెన్స్ గల ఏజెంట్ల వివరాలను జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మొబైల్ నంబర్ 8712656411 లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని ఆయన తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలి

ఎల్లారెడ్డిపేట, జూన్ 22: గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు గత యేడాది మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు చేరాలని ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సంబంధించిన గోడ ప్రతులను అధ్యాపకులతో కలిసి శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ మండల కేంద్రంలో ఈ విద్యా సంవత్సరానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని అన్నారు. బీఏ, బీకాం కంప్యూటర్స్, బీఎస్సీ(ఎంపీసీ) బీఎస్సీ(బీజడ్‌సీ) కోర్సులు మంజూరయ్యాయని అన్నారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, కళాశాలల అధ్యాపకులు విద్యార్థులను ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరేలా ప్రోత్సహించాలని అన్నారు. ప్రవేటు కళాశాల్లో చేరి ఆర్థికంగా నష్టపోకూడదని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సర్కారు డిగ్రీ కళాశాలలో చేర్పించి వారి ఉన్నతికి పాటు పడాలని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ కోరారు. దుమాల గురుకులం ప్రిన్సిపాల్ రామారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం: మాజీ ఎమ్మెల్యే

ఇల్లంతకుంట, జూన్ 22: కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. మండలంలోని పొత్తూరు గ్రామానికి చెందిన చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ప్రమాదవశాత్తు మృతిచెందగా బీఆర్ఎస్ పార్టీ పక్షాన రెండు లక్షల విలువైన బీమా చెక్కును అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీకి కార్యకర్తలే ప్రధానం అన్నారు. కార్యక్రమంలో జడ్పీవైస్ చైర్మన్ సిద్ధం వేణు, ప్యాక్స్‌చైర్మన్ తిరుపతిరెడ్డి, మండలశాఖ అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి, మాజీ సర్పంచు సిద్ధం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వేములవాడ అర్బన్ ప్రజాప్రతినిధులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 22: కలెక్టర్‌గా నూతనంగా విధుల్లో చేరిన సందీప్‌కుమార్ ఝూను శనివారం వేములవాడ అర్బన్ ప్రజాప్రతినిధులు మార్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో నూతనంగా విధుల్లో చేరిన కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝూను వేములవాడ అర్బన్ పరిధిలోని ప్రజాప్రతినిధులు కలిసి మిడ్‌మానేరు ముంపు గ్రామాల సమస్యలపై చర్చించారు. ముంగాల సమస్యలను పరిష్కారించాలని వినతి పత్రాన్ని అందజేశారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి వీలైనంత త్వరగా ముంపు గ్రామాల సమస్యలను పరిష్కారిస్తామని హామీ ఇచ్చినట్లు జడ్పీటీసీ మ్యాకల రవి, ఎంపీపీ బూర వజ్రమ్మబాబు, సెస్ డైరెక్టర్ రేగులపాటి హరిచరణ్‌రావు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ అర్‌సీ రావు, బీఆర్ఎస్ నాయకులు కొండపల్లి వెంకటరమణారావు, మైలారం రాము తదితరులు పాల్గొన్నారు.

● కలెక్టర్‌గా విధుల్లో చేరిన సందిప్‌కుమార్‌ఝూను శనివారం ముదిరాజ్ సంఘం నాయకుడు చొక్కాల రాము కలిశారు. మిడ్‌మానేరులో ముంపునకు గురైన గ్రామాల్లోని నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని, 18 సంవత్సరాలు నిండిన యువతులకు నిరుద్యోగ భృతిని కల్పించాలని, ముంపు గ్రామాలల్లో నష్టపరిహారం రానివారికి నష్టపరిహారాన్ని అందించాలని వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అంజేశారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

సిరిసిల్ల రూరల్, జూన్ 22: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్‌శివారులోని బాబాజీనగర్ మండల పరిషత్ పాఠశాల విద్యార్థులకు సిరిసిల్ల పట్టణ గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోషియేషన్ అధ్వర్యంలో నోట్ బుక్స్‌లను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, కోశాధికారి బుర్ర నాగరాజుగౌడ్, ఉపాధ్యక్షుడు నాగరాజుగౌడ్, అర్గనైజింగ్ కార్యదర్శి మహేష్‌గౌడ్, జాయింట్ కార్యదర్శి డాక్టర్ బాలగౌడ్, ఈసీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లిలో ప్రైవేట్ పాఠశాలను పెట్టనివ్వం

వీర్నపల్లి, జూన్ 22: మండల కేంద్రంలో ప్రైవేటు పాఠశాలను పెట్టనివ్వమంటూ, ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహిస్తామని గ్రామ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కమిటీ చైర్మన్ మల్లారపు అరుణ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు, తల్లిదండ్రులతో శనివారం సమావేశాన్ని నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందించాలని వారు ఉపాధ్యాయులకు సూచించారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలన్నారు. మండల ప్రజలందరూ కలిసికట్టుగా ప్రైవేట్ పాఠశాలకు అనుమతులు ఇవ్వద్దంటూ తీర్మానం చేశారు. సమావేశంలో అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ మాడుగుల రాజం, ప్రధాన కార్యదర్శి దేశరాజు నారాయణ, సభ్యులు, కేజీబీవీ ప్రత్యేక అధికారి నీలిమా, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతును రాజు చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ - రైతులకు స్వీట్లు పంపిణీ - జిల్లా వ్యాప్తంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం


సిరిసిల్లలో సీఎం, మంత్రుల చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు


వేములవాడ నందికమాన్ వద్ద..


ఎల్లారెడ్డిపేటలో..

రుద్రంగి, జూన్ 22 రైతు రాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీకి క్యాబినేట్ ఆమోదం తెలపడంతో రుద్రంగి మండల కేంద్రంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రైతులను కలిసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 వరకు ఋణాలు తీసుకున్న రైతులందరకీ రుణమాఫీ చేస్తామన్నారు. రైతుల పక్షాన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, నాయకులు తర్రె మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, కెసిరెడ్డి నర్సరెడ్డి, గండి నారాయణ, మాడిశెట్టి అభిలాష్, పల్లి గంగాదర్, ఇప్ప మహేష్ పాల్గొన్నారు.

● ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీకి క్యాబినేట్ ఆమోదం తెలపడంతో రుద్రంగి మండల కేంద్రంలో సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి క్షీరాభిషేకం నిర్వహించారు.

ఎల్లారెడ్డిపేట: రైతు సంక్షేమమే కాంగ్రెస్ సర్కారు ధ్యేయమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. అన్నదాతలకు రుణమాఫీ చేయడానికి మంత్రివర్గ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి స్థానిక రైతులు, నాయకులు శనివారం క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, గౌస్, శ్రీనివాస్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి, లింగాగౌడ్, రాజేందర్, రాజునాయక్, బాబు, బుచ్చాగౌడ్, రాములు, తిరుపతి, రాజయ్య, రవి, మ ల్లారెడ్డి, దేవయ్య, బాల్‌రెడ్డి, కిషన్, రామచంద్రం, మహేందర్ పాల్గొన్నారు.

వేములవాడ టౌన్: రైతు రుణమాఫీకి ఆమోదం తెలిపిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పట్టణ, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చెక్కపల్లి బస్టాండులో, మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నందికమాన్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేపట్టారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనకయ్య, పట్టణ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్, మున్సిపల్ వైస్‌చైర్మన్ బింగి మహేష్, నాయకులు సాగరం వెంకటస్వామి, చిలుక రమేష్, కనికరపు రాకేష్, కదిరేరాజ్‌కుమార్, పండుగ ప్రదీప్, ఇటిక్యాల రాజు ఉన్నారు.

సిరిసిల్ల టౌన్: సిరిసిల్ల పట్టణం గాంధీచౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గం ఇంచార్జి కేకే మహేందర్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, టీపీసీసీ సభ్యులు నాగుల సత్యనారాయణ, సంగీతం శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండల కేంద్రంలో రైతు రుణమాఫీని ఏకకాలంలో చేయడానికి నిర్ణయించడంతో రాష్ట్ర ప్రభుత్వం హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు శనివారం క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు హరిలాల్ నాయక్, నాయకులు జోగుల కాంతయ్య, ఫణి శివరామకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాట నర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, నాయకులు మల్యాల రాజవీర్, తిరుపతిగౌడ్, నర్సయ్య, లచ్చయ్య, ఎర్ర నర్సయ్య పాల్గొన్నారు.

కోనరావుపేట: ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణమాఫీ చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం నిమ్మపెల్లిలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, నాయకులు చేపూరి గంగాధర్, సదానందం, నాగండ్ల భూమేష్, మానుక సత్యం, పెంతల శ్రీనివాస్ పాల్గొన్నారు.


గంభీరావుపేటలో..


కోనారావుపేట మండలం నిమ్మపల్లిలో..

ఉపాధిలేకనే మరమగ్గాల కార్మికుల ఆత్మహత్యలు

- సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్

సిరిసిల్ల రూరల్, జూన్ 22: సిరిసిల్లలో ఎలాంటి ఉపాధి లేకపోవడంతోనే మరమగ్గాల కార్మికులు ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేకనే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా స్పందించి కార్మికులకు ఉపాధిని కల్పించాలని, ఆత్మహత్య చేసుకున్న నాగరాజు కుటుంబానికి రూ 25లక్షల ఎక్స్‌గ్రేషియాను చెల్లించాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని సీఐటీయూ అమృత్‌శుక్లా కార్మిక భవన కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో అయన మాట్లాడారు. వస్త్ర పరిశ్రమల సంక్షోభం వలన ఉపాధి లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో రాజీవ్‌నగర్‌కు చెందిన కుడిక్యాల నాగరాజు అనే నేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నాగరాజు కుటుంబానికి రూ 25 లక్షల ఎక్స్‌గ్రేషియాను అందించి అదుకోవాలని డిమాండ్ చేశారు. అధికార పక్షం, ప్రతిపక్షాల రాజకీయాల మధ్య ఇంకెంతమంది కార్మికులను బలి తీసుకుంటారని మండిపడ్డారు. ప్రభుత్వం ఇప్పటికైనా రాజకీయ కక్షసాధింపు ధోరణి విడనాడి ఆత్మహత్యల నివారణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, నాయకులు నక్క దేవదాస్, బెజుగం సురేష్, సందుపట్ల పోచమల్లు, వేముల మనోహర్, మామిడాల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మూషం రమేష్

వైభవంగా గంగమ్మ బోనాలు

రుద్రంగి, జూన్ 22 రుద్రంగి మండలం మానాల గ్రామంలో సత్యాగంగ పౌర్ణమి సందర్భంగా గ్రామస్థులు ఘనంగా గంగమ్మకు బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకోని డప్పుచప్పుళ్ల మధ్య గంగమ్మ వద్దకు భారిగా గ్రామస్తులు బయల్దేరారు. ఆనంతరం అమ్మవారికి నైవేదాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి పిసరి చిన్న భూమయ్య, మాజి సర్పంచ్ ఆల్లూరి మానస, విడిసి చైర్మన్ రవీందర్, జక్కు మోహన్, కొమ్ముల గంగారెడ్డి, జక్కుల లక్ష్మీనర్సయ్య, తదితరులు పాల్గోన్నారు.

చందుర్తి: మండలంలోని మల్యాలలో గంగపుత్రుల ఆధ్వర్యంలో గంగమ్మ బోనాల పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా గంగాపుత్రుల సంఘం ఆధ్వర్యంలో డప్పుచప్పులతో బోనంతో తరలివెళ్లి నైవేద్యం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, అబ్రహం, కుల సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న స్థానికులు

ఎల్లారెడ్డిపేట, జూన్ 22: గ్రామంలో నుంచి అతి వేగంగా వెళుతున్న ఇసుక ట్రాక్టర్లను శనివారం మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన స్థానికులు అడ్డుకున్నారు. డ్రైవర్లతో వాగ్వాదానికి దిగారు. మితిమీరిన వేగం వల్ల మూలమలుపు వద్ద ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోందని ఆగ్రహించారు. ఆరుబయట ఆడుకునే పిల్లలకు ఏం అవుతుందోనని భయాందోళన చెందాల్సి వస్తోందని ధ్వజమెత్తారు. సుమారు గంట పాటు వాహనాలను నిలిపివేశారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. ఇరువర్గాలను శాంతింపజేయడానికి చేసిన ప్రయత్నం విఫలమైంది. అనుమతి ఉన్న మితిమీరిన వేగం వల్ల ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. తమ గ్రామం మీదుగా గంభీరావుపేట మండలానికి వాహనాలను నడవనీయమని స్పష్టం చేశారు. వేగంతో వెళితే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో స్థానికులు శాంతించారు. మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి, స్థానికులు ఉన్నారు.

ఐడీ కార్డుల అందజేత

తంగళ్లపల్లి, జూన్ 22: హ్యూమన్‌రైట్స్ అండ్ జస్టిస్ మూమెంట్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ హమీద్ అధ్వర్యంలో మండల కేంద్రంలో కమిటీ సభ్యులకు ఎంపీపీ పడిగెల మానస రాజు చేతుల మీదుగా ఐడీ కార్డ్స్, అపాయింట్‌మెంట్ లెటర్లను శనివారం అందజేశారు.

పోడు భూముల వద్ద ఆందోళన

ఎల్లారెడ్డిపేట, జూన్ 22: ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామ శివారులోని పోడు భూముల్లో అటవీశాఖ అధికారులు ఉపాధి హామీ పనులు చేపట్టడంతో శనివారం స్థానికులు ఆందోళనకు దిగారు. ఆ భూముల్లో పనులు చేయవద్దని అడ్డుకునేందుకు యత్నించారు. ఎఫ్ఎస్‌వో సకారం చేరుకుని పనులను అడ్డుకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోడు భూముల కోసం ప్రభుత్వానికి విన్నవించాలని సూచించారు. పోడు భూముల కమిటీ అధ్యక్షుడు రాజునాయక్ కల్పించుకుని పనుల విషయంలో అటవీశాఖ అధికారులు పునరాలోచన చేయాలని కోరారు. పనులకు ఆటంకం కల్గించవద్దని సూచించడంతో ఆందోళనకారులు తిరిగి వెళ్లారు.

గీతామందిరంలో శివలింగాల తయారీ

ఎల్లారెడ్డిపేట, జూన్ 22: కాశీలో కార్తీక మాసంలో నిర్వహించనున్న కోటి పార్థివ లింగార్చన కార్యక్రమానికి వినియోగించేందుకు ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని గీతా మందిరంలో వేద పండితుడు రాచర్ల రఘురామ శర్మ ఆధ్వర్యంలోని మహిళ భక్తులు శివ లింగాలను తయారికీ శనివారం శ్రీకారం చుట్టారు. 25 వేల శివలింగాలను మట్టితో తయారు చేస్తున్నామని రఘురామశర్మ పేర్కొన్నారు. కాశీలో జరిగే కోటి పార్థివ లింగార్చన కోసం మహిళ భక్తులు లింగాలను రూపొందిస్తున్నారని తెలిపారు. తయారు చేసిన శివలింగాలను కమిటీ సభ్యులకు అందజేయనున్నామని చెప్పారు.

వ్యవసాయ బావిలో పడిన శునకం

- కాపాడిన ఫైర్ సిబ్బంది

వేములవాడ టౌన్, జూన్ 22: వ్యవసాయబావిలో పడిన శునకాన్ని ఫైర్ సిబ్బంది కాపాడి బయటకు తీసిన సంఘటన వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. ఫైర్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం శాత్రాజుపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో ఐదురోజులుగా పడివుందని గ్రామస్థులు 101 ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో స్పందించిన ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్థుల సహకారంతో బావిలోని కుక్కని సురక్షితంగా బయటకు తీశారు. దీంతో గ్రామస్థులు ఫైర్ సిబ్బందిని అభినందించారు. శునకాన్ని రక్షించిన వారిలో ఫైర్‌సిబ్బంది కమలాకర్, రాజేంద్రప్రసాద్, యాదయ్య, శంకర్, రాజేశం, జీవన్‌రెడ్డి ఉన్నట్లు తెలిపారు.

స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోట్ చేయాలి

ముస్తాబాద్ జూన్ 22: బీఈడీ చేసిన స్కూల్ అసిస్టెంట్‌లకు ఉన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోట్ చేయాలని ముస్తాబాద్ మండలంలోని బీఎడ్ చేసిన ఎస్జీటీ ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముస్తాబాద్‌లోని ఎంఆర్సీలో శనివారం వినతిపత్రాన్ని అందించారు. ఎస్జీటీగా బీఈడీ చేసిన ఉపాధ్యాయులు ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుల ప్రమోషన్లలో అర్హులు కారని ప్రభుత్వం భావించడంతో ప్రతి ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోట్ చేయాలని బీఎడ్ చేసిన ఎస్జీటీ ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యాంసుందరశర్మ, ఎల్లమ్మల లక్ష్మణ్, పద్మకళ, దేవేందర్‌రావు, రమేశ్ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నేదునూరి జ్యోతి

సిరిసిల్ల టౌన్, జూన్ 22: రాష్ట్రంలో మహిళలపై దాడులు పెరుగుతున్నాయని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా నిందుతులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ మహిళ సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి డిమాండ్ చేశారు. శనివారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో తెలంగాణ మహిళ సమాఖ్య జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి జ్యోతి మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలపై జరిగిన వరస సంఘటనలతో బెంబేలెత్తున్నారన్నారు. మద్యం మత్తులో పురుషులు మహిళలపై రోజురోజుకు దాడులు పెరుగుతున్నాయని ఆరోపించారు. గతంలో దాడులకు పాల్పడిన వారిపై పెట్టిన కేసులు వంద సంఖ్యలలో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ కేసులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గంజాయి వంటి మారక ద్రవ్యాలు అరికట్టకపోవడంతో ఏరులై పారుతున్నాయని ఆరోపించారు. ప్రశ్నించే గొంతుకలపై అక్రమ కేసులు పెట్టడం అప్రజాస్వామికం అని, అరుంధతిరాయిపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం సమాఖ్య జిల్లా నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. కన్వీనర్ ఏ రోజా, కో కన్వీనర్లుగా జి మంజుల, కే లక్ష్మి, సత్తవ్వ, ప్రేమలతను ఎన్నుకున్నారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకుడు మీసం లక్ష్మన్, సమాఖ్య సభ్యులు మణెవ్వ, పుష్పలత, రామవ్వ, లక్ష్మి, నరసమ్మ, యశోద, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల అతివేగం: బెంబేలెత్తుతున్న జనం

వేములవాడ టౌన్, జూన్ 22: ఇసుక ట్రాక్టర్‌ల అతివేగం పట్టణ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. వేములవాడ మండలం జయవరం గ్రామం మూలవాగు నుంచి ఇసుక పర్మిషన్‌ను రెవెన్యూ అధికారులు ఇచ్చారు. దీంతో ఇసుక ట్రాక్టర్ యజమానుల స్పీడ్‌కు బ్రేక్‌లు లేకుండా పోయాయి. ఇసుక ట్రాక్టర్‌ల ఓవర్ స్పీడ్‌కు ప్రజలు భయభ్రాంతులకు గురువతున్నారు. మల్లారం రోడ్డు వైపు ద్వారగకనగర్ రోడ్ నంబర్ వన్ నుంచి చర్చి సమీపం మీదుగా భీమేశ్వర గార్డెన్ నుంచి కొనాయపల్లికి వెళ్లే మార్గం ఇరుకుగా ఉండటంతో ఇసుక ట్రాక్టర్‌ల అతివేగం స్థానిక కాలనీ వాసులను ఇండ్లల్లో నుంచి బయటకు రాకుండా చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక ట్రాక్టర్‌ల స్పీడ్‌కు అడ్డు అదుపు లేకుండా పోతుందని, ఇళ్లలో నుంచి అడుగు బయటపెట్టేందుకు కూడా జనం జంకుతున్నారని కాలనీవాసులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారు. చాలా వరకు మైనర్లు ఇసుక ట్రాక్టర్‌లను నడిపిస్తున్న పోలీసులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నారు. ఇసుక ట్రాక్టర్‌ల ఓవర్ స్పీడ్‌తో ప్రమాదాలు జరగకముందే తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక కాలనీవాసులు కోరుతున్నారు.

● ధ్వంసమవుతున్న రోడ్లు..

మల్లారం రోడ్డు నుంచి కొనాయపల్లికి వెళ్లే రోడ్డులోనే ఇసుక ట్రాక్టర్‌లు పోటీపడి మరీ ఓవర్ స్పీడ్‌తో వెలుతున్నారు. రెవెన్యూ అధికారుల అనుమతితో ఇసుకను కొట్టాల్సిన ట్రాక్టర్ నిర్వాహకులు మల్లారం రోడ్డు చౌరస్తా మీదుగా కోరుట్ల బస్టాండ్ నుంచి కొనాయపల్లికి వెళ్లాల్సిన ట్రాక్టర్‌లను అడ్డదారిలో ఇరుకు రోడ్ల నుంచి ట్రాక్టర్లను ఓవర్ స్పీడ్‌తో నడుపుతూ కాలనీవాసులకు ఇబ్బందుల తలెత్తేలా చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ద్వారకానగర్ రోడ్ నంబర్ వన్‌లో చర్చి సమీపంలో రోడ్డు పూర్తిగా ఛిద్రమైన చిన్నవాహనాలు నడవలేని పరిస్థితి నెలకొన్నప్పటికీ ట్రాక్టర్లను అతివేగంగా అందులో నుంచి నడపడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయి.ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిఘా ఏర్పాటు చేసి ఇసుక ట్రాక్టర్‌ల వేగాన్ని నియంత్రించాలని కోరుతున్నారు.


ఇరుకు రోడ్డులో ఓవర్ స్పీడ్‌తో వెళుతున్న ఇసుక ట్రాక్టర్(ఫైల్)

● మైనింగ్ ఏడీపై దురుసుగా ప్రవర్తించిన ఇసుక ట్రాక్టర్ డ్రైవర్

వేములవాడ టౌన్: వేములవాడ మండలం జయవరం గ్రామ సమీపం నుంచి రెవెన్యూ అధికారులు స్థానిక అవసరాలకు ఇసుక అనుమతినిచ్చారు. అయితే ఇసుక అనుమతి పేరుతో ట్రాక్టర్‌లను ఓవర్ స్పీడ్‌గా నడుపుతూ అక్రమ దందాకు పాల్పడుతున్నారని పట్టణంలో ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. తనిఖీల్లో భాగంగా జిల్లా మైనింగ్ ఏడీ క్రాంతికుమార్ తన సిబ్బందితో వేములవాడ పట్టణంలోని కొనాయపల్లి రోడ్డులో తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగా వాహనాల తనిఖీ చేస్తున్న తరుణంలో ఓ ఇసుక ట్రాక్టర్ ఆపకుండా వేగంగా వెళ్లడాన్ని గుర్తించిన ఏడీ ఆపేందుకు ప్రయత్నించారు. ట్రాక్టర్‌ను నిలిపి వేసిన సదరు డ్రైవర్ మైనింగ్ ఏడీ కాంత్రికుమార్‌పై దురుసుగా ప్రవర్తిస్తూ దాడికి యత్నించినట్లు సోషల్ మీడియాలో వీడియో వైరల్‌గా మారింది. స్థానికం గా వున్న ప్రజలు ఒక్కసారిగా అక్కడికి చేరుకోవడంతో అధికారులతో డ్రైవర్ ప్రవర్తించిన తీరుకు అక్కడే వున్న ప్రజలు ఒక్కసారిగా నివ్వెరపోయినట్లు తెలిసింది.